సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

జంక్షన్‌లో టెన్షన్

వాహనాల వేగానికి కళ్లెం వేస్తూ.. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే సిగ్నల్ వ్యవస్థను కొన్నిచోట్ల నిరుపయోగంగా వదిలేస్తున్నారు. వాటిని వాడకపోవడం వల్ల వాహన చోదకులు ఇష్టారీతిన కూడళ్లను దాటుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. సౌత్ జైలురోడ్డు, లీలామహల్, దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వినియోగించకపోవడం వల్ల అవి నిరుపయోగంగా ఉన్నాయని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు.

- సౌత్ జైలురోడ్డు, లీలామహల్, డీఆర్ఎం కార్యాలయం కూడళ్లలో నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నల్స్
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

అల్లిపురం : సౌత్ జైలురోడ్డు, లీలామహల్ జంక్షన్ విపరీతమైన ట్రాఫిక్‌తో పద్మవ్యూహాన్ని తలపిస్తుంటాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వచ్చే బస్సులు, అల్లిపురం మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్ నుంచి వచ్చే వాహనాలు, దొండపర్తి డీఆర్ కార్యాలయం రోడ్డు నుంచి వచ్చే వాహనాలతో బీఆర్ రెడ్డి జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఒక్కోసారి మధ్యలో వాహనాలు ఒకదానికి ఒకటి అడ్డుగా ఉండటంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. దీనివల్ల రైల్వే స్టేషన్‌కు సమయానికి చేరుకోలేక రైలు మిస్ అయిన సంఘటనలు కోకొల్లలు. ఈ ప్రాంతంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. అవి ఏర్పాటు చేసిన దగ్గర నుంచి వినియోగించిన పాపాన పోలేదని స్థానికులంటున్నారు.

లీలామహల్ జంక్షన్‌లో..

లీలామహల్ థియేటర్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. నాలుగు వైపులా వాహనాలు వచ్చి ఇరుక్కోవటంతో రద్దీ ఏర్పడుతుంది. ఇది బిజీ సెంటర్ కావటంతో వాణిజ్య వాహనాల రాకపోకలు అధికం. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఒకేలా సాగుతుంది. ఈ ప్రాంతంలో పెట్రోలు బంకు కూడా ఉండటంతో వాహనాల తాకిడి అధికం. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకోవడం పరిపాటేనని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ అవి నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డీఆర్ఎం కార్యాలయం జంక్షన్‌లో..

దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ కూడా దిష్టిబొమ్మల్లా మారాయి. కేవలం బ్లింకింగ్ సిగ్నల్ మినహా మిగిలినవి పని చేయటం లేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించకపోవటం పట్ల ప్రజలు, వాహన చోదకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల సంగం, శరత్ జంక్షన్‌లో ఆటో ప్రమాదంతో నగర పోలీస్ కమిషనర్ రాత్రి, పగలు తేడా లేకుండా సిగ్నల్ వ్యవస్థను నిరంతరాయంగా కొన్ని చోట్ల వెలిగించి వదిలేస్తున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాలైన డీఆర్ఎం కార్యాలయం, బీఆర్‌రెడ్డి జంక్షన్, లీలామహల్ జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ అవి కేవలం దిష్టిబొమ్మల్లా ఉన్నాయే తప్ప వాటి వలన ఎటువంటి ప్రయోజనం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



డీఆర్ఎం కార్యాలయ జంక్షన్

బీఆర్ రెడ్డి జంక్షన్‌లో ట్రాఫిక్



బీఆర్‌రెడ్డి జంక్షన్‌లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్

లక్షలాది రూపాయలు వృథా..

నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతాలను గుర్తించిన నగర పోలీసులు ఆ జంక్షన్‌లలో సిగ్నల్ వ్యవస్థలను లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారు. కాని వాటిని తగిన విధంగా ఉపయోగించకపోటంతో లక్షలాది రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో కొన్ని చోట్ల అసలు రద్దీలేని ప్రాంతాల్లో రాత్రి, పగలు సిగ్నల్స్ వెలిగించి వదిలేస్తున్న పోలీసులు, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా ఉపయోగించక పోవటం శోచనీయం. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని, లైసెన్స్ రద్దు చేస్తామని చెబుతున్న ట్రాఫిక్ పోలీసులు కొన్నిచోట్ల నిరుపయోగంగా ఉన్న సిగ్నల్స్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.



డీఆర్ఎం జంక్షన్‌లో బ్లింకింగ్ (ఎల్లో)కి పరిమితమైన సిగ్నల్ లైట్లు

అందుబాటులోకి తీసుకురావాలి



ప్రమాదాల నివారణతో పాటు, ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. అవి సరిగ్గా పని చేస్తున్నాయో లేదో.. పని చేస్తే వాటిని అవసరానికి తగ్గట్లు వాడుతున్నదీ లేనిదీ అధికారులు పరిశీలించాలి. బీఆర్ రెడ్డి జంక్షన్, లీలామహల్ జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అందుబాటులోకి తీసురావాలి. అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చు.

– పాల శ్రీహరిరెడ్డి, అల్లిపురం

ఉన్నవాటిని వినియోగించుకుంటే మంచిది..



లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఉపయోగించుకుంటే మంచిది. నగరంలో చాలా చోట్ల రద్దీ లేని ప్రాంతాల్లో రాత్రీపగలు సిగ్నల్స్ ఆన్ చేసి ఉంచుతున్నారు. రద్దీ ప్రాంతాల్లో ఉన్న వాటిని వినియోగించటం లేదు. ఈ తీరు మారాలి. ఉన్న వాటిని సద్వినియోగం చేసుకుంటే ప్రయాణికులకు మేలు కదా.

– ఎం.వి.అప్పారావు, బంగారుమెట్ట

క్లుప్తంగా

ఘనంగా బల్లిగిరి వెంకన్నకు పూజలు



అల్లిపురం : బాద్రపద శుద్ధ ఏకాదశి, పార్శ్వ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో హోమం చేపట్టారు. అనంతరం వెంకన్నను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామార్చన చేపట్టారు.

నేడు ఘంటసాల బయోపిక్ ప్రీవ్యూ ప్రదర్శన

దాబాగార్డెన్స్ : ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల జీవిత విశేషాల్ని వెండి తెరపై ఆవిష్కరించే ప్రయత్నంలో మాజీ పోలీస్ అధికారి సీహెచ్ రామారావు దర్శక, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 15 ఉదయం 8 గంటలకు నగరంలోని సంగం, శరత్ థియేటర్లో ఘంటసాల ప్రీవ్యూ షో ప్రదర్శించబడుతుందని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. గాయనీ, గాయకులు, ఘంటసాల అభిమానులు, కళాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



మాట్లాడుతున్న రెహ్మాతుల్లా

మహారాణిపేట : వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డేని పురస్కరించుకుని వీఎస్ కృష్ణా డిగ్రీ కాలేజీ, పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. విశాఖపట్నం రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ పి. రవికుమార్ మాట్లాడుతూ తీవ్ర ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ పీరియడ్‌గా పరిగణించే మొదటి 10 నిమిషాలు బాధితుల ప్రాణం రక్షించేందుకు ఉపయోగించే మెలకువలను రెడ్ క్రాస్ ద్వారా నేర్పిస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్, ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ ఎండీ రెహ్మాతుల్లా మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణలో భాగంగా ప్రమాదం జరిగినప్పుడు రక్తస్రావాన్ని తగ్గించడం, ఎముకలు విరిగినప్పుడు నొప్పి నుంచి ఉపశమనం కల్పించడం, కట్లు కట్టడం, గుండెపోటు, కరెంట్ షాక్, నీటిలో మునిగిపోవడం వంటి ప్రమాదాలు జరిగి స్పృహ కోల్పోయి శ్వాస లేదా గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడే పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ పీఆర్వో ఎస్‌కేఎల్ రావు, కౌన్సిలర్ పాగోటి రాంబాబు, కృష్ణా కాలేజీ ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు, ఆదర్శ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ థియోఫిలస్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద బాలలకు సాయంత్రం ట్యూషన్

మద్దిలపాలెం: మురికివాడల్లోని బడి ఈడు పిల్లల కోసం సాయంత్రం ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆపేసిన పేద బాలలకు విద్యను అందించే ఉద్దేశంతో ఉచిత ట్యూషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బీచ్ రోడ్డులోని ఫిషింగ్ హార్బర్ వద్ద గల సఫనెట్ హాస్టల్ పక్కన ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. సోమవారం నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



నేరెళ్లకోనేరులో దీపారాధనలో భక్తులు

అల్లిపురం : స్థానిక మెయిన్‌రోడ్డులో గల శ్రీ సిద్ధి వినాయక ఆలయం వద్ద భక్తులు శనివారం ఘనంగా దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము, పీపీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్లకోనేరులో..

రైజింగ్ గైస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం మండపం వద్ద వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సేవా ట్రస్ట్ కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది.

ఉత్సాహంగా స్టూడెంట్ కౌన్సిల్ వేడుకలు



విజేతలకు మిస్ ఫ్రెషర్ అవార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం : జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 67వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవ వేడుకలు శనివారం ఉల్లాసంగా నిర్వహించారు. కొత్తగా చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ఆచార్య సుమిత్రా శ్రీపాద పాల్గొని వేడుకలను ప్రారంభించారు. మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్, గృహ హింస చట్టం గురించి అవగాహన కల్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకర్షించాయి. మిస్ ఫ్రెషర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిగ్రీ విభాగంలో సాయిప్రణతి, వైష్ణవి, పావని, ఇంటర్ విభాగంలో పల్లవి, కీర్తన విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, హరిణి, పావని, ప్రమీల, దీపాలి, రమణీలత, పవన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కౌన్సిల్ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ నర్సులను క్రమబద్ధీకరించాలి



కేజీహెచ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

మహారాణిపేట : తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ నర్సులు కేజీహెచ్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. గత ఎనిమిది రోజుల నుంచి చేస్తున్న నిరసన ప్రదర్శనలు శనివారం 9వ రోజుకు చేరుకున్నాయి. కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలని యూనియన్ నాయకుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 115ను తక్షణం రద్దు చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసిన కాంట్రాక్టు నర్సులకు పోస్టింగ్‌లో తగిన ప్రాధాన్యత కల్పించాలని పోరాట కమిటీ నాయకురాలు వరలక్ష్మి అన్నారు. విధులకు ఆటంకం కలిగించకుండా శాంతియుతంగా నిరసన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ నర్సులు, నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణలో ఐసీఈయూ పాత్ర ఎనలేనిది



సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్

దాబాగార్డెన్స్ : ఉద్యోగుల డిమాండ్ల సాధన, ప్రభుత్వ రంగంలో ఎల్ఐసీ పరిరక్షణ, కార్మిక వర్గ పోరాటాల సాధనలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కీలకపాత్ర పోషిస్తుందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్ తెలిపారు. ఐసీఈయూ విశాఖ డివిజన్ గోల్డెన్ జూబ్లీ కాన్ఫరెన్స్ విషయమై శనివారం ఎల్ఐసీ స్పోర్ట్స్ క్లబ్‌లో రిసెప్షన్ కమిటీ ఏర్పాటైంది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సభ్యులకు ట్రేడ్ యూనియన్ విద్య, ఏజెంట్ల మద్దతు, కొత్త వ్యాపార పోటీ, క్లెయిమ్‌ల క్లియరెన్స్, బడ్జెట్–2024 వంటి విభిన్న సమకాలీన అంశాలపై అనేక సెమినార్లు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఐఆర్‌డీఏ ప్రతిపాదనలు తదితర అనేక కార్యకలాపాలతో గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్నామన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేద పిల్లలకు పుస్తకాల పంపిణీ, గిరిజన హాస్టళ్లలో వైద్య శిబిరం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్వర్ణోత్సవ సంవత్సరం ముగింపును పురస్కరించుకుని ఐసీఈయూ మహాసభలు అక్టోబర్ 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. సదస్సుకు ఎస్. కృష్ణమూర్తి చైర్మన్‌గా, జి. వరప్రసాద్ కన్వీనర్‌గా రిసెప్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను కె. మోహనరావు, గణపతి, రాము, బి. శ్రీనివాసరావు, తిరుమలరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, జీఎల్ ప్రసన్న తదితరులు ఆవిష్కరించారు.

22న మిరాకిల్ టాలెంట్ అవార్డు పోటీలు

దాబాగార్డెన్స్ : మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న టాలెంటెడ్ అవార్డ్స్– 2024 పేరిట పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో శనివారం పోటీల పోస్టర్‌ను క్లబ్ కళాకారులచే ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, కామెడీ స్కిట్స్, ఏకపాత్రాభినయం, డైలాగ్స్, పెయింటింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని చెప్పారు. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ప్రదర్శన అయిన వెంటనే సర్టిఫికెట్, మెమెంటో అందజేయనున్నట్టు చెప్పారు. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా పోటీలు ఉంటాయని, పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు షకీల్ తెలిపారు. టాలెంటెడ్ అవార్డ్స్ పోటీలో పాల్గొనదలచే వారు 9966485335 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజా గాయకుడు గంగిరెడ్డికి కన్నీటి వీడ్కోలు



మెడికల్ కాలేజీ అనాటమీ విభాగానికి గంగిరెడ్డి పార్థివదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట : ప్రజాగాయకుడు, కవి, రచయిత గంగిరెడ్డి సన్యాసిరావు (74) శనివారం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ గాజువాకలో గల తన చిన్న కుమారుడు సుందరయ్య ఇంటి వద్ద మరణించారు. ఆయన మృతదేహాన్ని కేజీహెచ్‌కు అంతిమ యాత్రగా తీసుకొచ్చి పార్థివదేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ డిపార్ట్‌మెంటుకు అప్పగించారు. సన్యాసిరావు నిరంతరం ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ తన పాటల ద్వారా ఊపునిచ్చేవారు. కంటి చూపు లేదని ఎన్నడూ తన వృత్తికి, ఉద్యమాలకు దూరం కాలేదు. ఆయన కోరినట్టు కుటుంబ సభ్యులు మెడికల్ కాలేజీకి సన్యాసిరావు పార్థివదేహాన్ని అప్పగించారు. కాగా ఆయన మరణం కళా రంగానికి తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గంగారావు తదితరులు తెలిపారు.

గణపతి మండపాల వద్ద అన్నదానాలు



శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో అన్నదానం చేస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి

అల్లిపురం : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వాడవాడలా అన్నదానాలు చేపట్టారు. నవరాత్రి ఉత్సవాల పుణ్యమా అని పేద, ధనిక తేడా లేకుండా అందరూ అన్నప్రసాదంతో కడుపు నింపుకున్నారు.

శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నీలమ్మ వేపచెట్టు రోడ్డులో శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం గణపతి మండపం వద్ద మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొన్నారు. సుమారు 8 వేల మందికి అన్నసదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, రేణుక యల్లమ్మ ఆలయం ప్రతినిధులు బొడ్డు పోలారావు, నాగరాజు, సత్యనారాయణ పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న పూర్ణిమ, శ్రీధర్

35వ వార్డులో..

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో శనివారం రామకృష్ణా వీధి యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానానికి మించిన దానం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ల బుజ్జి, మళ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో..

దాబాగార్డెన్స్ : శనివారం జీవీఎంసీ 41వ వార్డు పరిధిలో నిర్వహించిన అన్నసమారాధనలకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ విరాళాలు అందజేశారు. పోస్టాఫీస్ వీధిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి రూ.15 వేలు, బాబూకాలనీలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలకు రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బాబూ కాలనీ జీఎఫ్‌ఏ బాయ్స్ కుమార్, రఫీ, గణేష్, మణికంఠ, కార్తీక్, పాండు, పోస్టాఫీస్ వీధిలో బ్లడ్ లైన్ బాయ్స్, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు





సహస్ర తులసిపూజలో సిరులతల్లి, పవిత్రోత్సవాల్లో భాగంగా విశేష పూజలు చేస్తున్న వైదిక సిబ్బంది

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారం రెండో రోజుకి చేరాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఏడాదిలో దేవస్థానంలో నిర్వహించే పూజాధికాలు (అర్చనలు, హోమాలు, నివేదనలు)లో భక్తుల ద్వారా గానీ, మరెవరి వల్లనైనా తెలిసీ, తెలియక జరిగిన దోషాలు ఏమైనా ఉంటే వాటిని నివారించేందుకు సంవత్సరకృత ప్రాయశ్చిత్తంగా పవిత్రోత్సవాలు ఏడాదికోసారి నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఉదయం 8 నుంచి గణపతి పూజ పుణ్యాహవాచన, పంచగవ్యారాధన, ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి అగ్నిధ్యానం, పవిత్ర పంచకుంభ అభిమంత్రణ, సర్వేదేవతా ఆహ్వానార్థం, హౌత్రాప్రశంసనం, పంచతల్ప శయ్యాప్పధివాసం నిర్వహించారు. ఆలయ వైదిక సిబ్బంది, ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేజీహెచ్ ఔట్‌గేట్ వద్ద దృశ్యమిది. ఇక్కడున్న డివైడ్‌ను దాటుకుని కేజీహెచ్‌లోకి వెళ్లేందుకు రోగులు ప్రయత్నిస్తుండగా.. వాహనాలు దూసుకు రావడంతో నిరీక్షిస్తున్న రోగులు.. వారి బంధువులు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్,విశాఖపట్నం

వసతిగృహానికి వ్యక్తి తరలింపు



ఆశ్రయం పొందిన వ్యక్తి

సీతమ్మధార : టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వ్యక్తిని తరలించారు. సీతంపేట ప్రాంతంలో రాయుడు నరసింహ మూర్తి (39) అనుమానాస్పదంగా తిరుగుతుండగా 4వ పట్టణ క్రైం పోలీసులు గమనించి శుక్రవారం రాత్రి వసతిగృహానికి తరలించారు. ఇతన్ని విచారణ నిమిత్తం శనివారం వసతిగృహం నుంచి 4వ పట్టణ క్రైం కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.







